సాక్షి
గుంటూరు
శనివారం, 16, నవంబర్, 2024



రజత శంఖుచక్రాలు అందజేత

రేపల్లె రూరల్: రేపల్లె రైలుపేటలోని పట్టాభి రామస్వామి ఆలయంలో స్వామివారికి శైలజ-వెంకటేశ్వరరావు దంపతులు శుక్రవారం కిలో వెండి శంఖుచక్రాలను అందజేశారు.



గ్రామాల్లో సర్వే

ఫిరంగిపురం: మండలంలో శుక్రవారం కూడా ఎన్‌సీడీసీడీ సర్వే నిర్వహించారు. సిబ్బంది ఇంటింటికి వెళ్లి బీపీ, షుగర్, ఆర్బీసీ, క్యాన్సర్ పరీక్షలు చేసి యాప్‌లో నమోదు చేశారు.

పూజితకు బంగారు పతకం

వినుకొండ(నూజెండ్ల): మండలంలోని కుమ్మరపాలెం గ్రామానికి చెందిన అంగటి పూజిత నున్న గ్రామంలో జరిగిన బాలికల కుస్తీ పోటీల్లో బంగారు పతకం సాధించింది. నాగార్జునసాగర్‌లో 8వ తరగతి చదువుతోంది. జాతీయ పోటీల్లో పాల్గొననున్నది.



పోలీసుల ద్వంద్వనీతి

ఒక్కొక్కరికి ఒక్కో న్యాయం

- ఒకే కేసులో ఒకరికి రిమాండ్, మరొకరికి 41 నోటీసులు
- అధికారపార్టీ సామాజికవర్గం వారికి కొమ్ముకాసిన వైనం
- వివక్ష చూపుతున్నారంటూ బ్రాహ్మణ మహాసభ ఆందోళన
- అరండల్‌పేట పోలీస్ స్టేషన్ ముందు నిరసన
- వైస్సార్‌సీపీ నేతల మీద అయితే వెంటనే కేసులు
- ఐటీడీపీపై మాజీ మంత్రి రజిని ఫిర్యాదు చేసి 20 రోజులు దాటినా స్పందించని ఖాకీలు



సాక్షి ప్రతినిధి, గుంటూరు: గుంటూరు పోలీసుల వ్యవహారశైలి విమర్శలకు దారితీస్తోంది. ముఖ్యంగా సోషల్ మీడియా కార్యకర్తలు, వైఎస్సార్ సీపీ నేతలపై పెడుతున్న కేసుల విషయంలో వారి వైఖరి కుటిల నీతికి అద్దం పడుతోంది. వైఎస్సార్ సీపీ నేతలైతే ఒక లెక్క.. అధికార పార్టీ నేతలైతే మరో లెక్క అన్నట్లుగా వారి తీరు ఉంటుంది. అధికార పార్టీ సామాజికవర్గం వారైతే ఉదాసీనంగా వ్యవహరించి.. మరొకరైతే కఠినంగా ముందుకు పోతుండడంతో బ్రాహ్మణ మహాసభ నిరసన వ్యక్తం చేస్తోంది.

పాల'కులం'టే ప్రేమా..!

రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అథియావాలా) నేత బోరుగడ్డ అనిల్‌కుమార్ అరెస్టు తదనంతర పరిణామాలలో గుంటూరు అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో చోటుచేసుకున్న ఘటనలు వివాదాస్పదమయ్యాయి. తొలుత ఆయనను రాజమండ్రి తరలిస్తున్న సమయంలో ఒక రెస్టారెంట్‌కు తీసుకువెళ్లి భోజనం పెట్టించిన వీడియో వైరల్ కావడంతో ఏడుగురు పోలీసులను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. తర్వాత అరండల్‌పేట స్టేషన్‌లో కస్టడీ విచారణ సమయంలో అనిల్‌కు రాచమర్యాదలు జరిగాయంటూ వీడియో ఫుటేజీలు ఒక్కొక్కటిగా వెలుగు చూశాయి. తాము కోర్టు ఆదేశాల మేరకే అతనికి సదుపాయాలు కల్పించామంటూ స్వయంగా ఎస్పీ మీడియా ముందుకు వచ్చి ప్రకటించారు కూడా. అయితే తర్వాత అరండల్‌పేట పోలీస్‌స్టేషన్ సీఐ కె.శ్రీనివాసరావును వీఆర్‌కు పంపారు. రాచమర్యాదలు చేస్తున్న వీడియో ఫుటేజ్ బయటకు రావడాన్ని ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణించారు. దీనిపై విచారణ చేపట్టారు. సీసీ కెమెరాల టెక్నీషియన్ అరండల్‌పేటకు చెందిన శేషు, ఓ పత్రిక క్రైం రిపోర్టర్ కన్నెగంటి అరుణ్ కుమార్‌లపై ఈనెల 9న రాత్రి కేసు నమోదు చేశారు. ఐపీసీ 66, 66-డీ, 67సీ ఐటీఏ-2000-2008 సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. టెక్నీషియన్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. విలేకరి అరుణ్‌కుమార్ అధికార పార్టీ సామాజికవర్గానికి చెందిన వారు కావడంతో అతడిని అరెస్టు చేయలేదు. మరోవైపు దర్యాప్తులో తాను, అరుణ్‌కుమార్‌లతో పాటు టీవీ-5 కెమెరామెన్ వంశీ కూడా ఉన్నట్లు శేషు వెల్లడించాడు. దీంతో పోలీసులు వంశీపైనా కేసు నమోదు చేశారు.

టీవీ5 కెమెరామెన్‌కు మద్దతుగా టీడీపీ నేతలు

దీంతో పోలీసులు గురువారం టీవీ 5 కెమెరామెన్ వంశీని స్టేషన్‌కు తీసుకువచ్చారు. ఈ విషయం తెలుసుకున్న తెలుగుదేశం నాయకులు పెద్ద ఎత్తున స్టేషన్‌కు చేరుకుని అధిష్ఠానంతో మాట్లాడటంతో అక్కడి నుంచి వచ్చిన ఆదేశాల మేరకు వంశీకి 41 నోటీసు ఇచ్చి పోలీసులు పంపేశారు. అతని పేరు చేరుస్తూ అల్టర్ చేసిన ఎఫ్ఐఆర్ కాపీని ఇప్పటి వరకు బయటపెట్టలేదు. విచారణ పూర్తి కాలేదని అందుకే 41 నోటీసు ఇచ్చామని పోలీసులు చెబుతున్నారు. ఈ కేసులో కన్నెగంటి అరుణ్ కుమార్ పరారీలో ఉన్నాడని పేర్కొంటున్నారు. కులమతాలకు అతీతంగా సమన్యాయం చేయాల్సిన పోలీసులే కులాలకు, పార్టీలకు కొమ్ముకాస్తున్నారన్న ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి.

మాజీ మంత్రుల ఫిర్యాదులపై స్పందనేదీ!

వైఎస్సార్ సీపీకి చెందిన మాజీ మంత్రి విడదల రజినిపై, మాజీ మంత్రి అంబటి రాంబాబుపై ఆయన సతీమణి, కుమార్తెలపై ఐటీడీపీ మీడియాలో అత్యంత దారుణంగా పోస్టులు పెడుతున్నారని ఫిర్యాదు చేసినా వాటిని పోలీసులు చెత్త బుట్టలో పడేస్తున్నారు. రజిని జిల్లా ఎస్పీతోపాటు డీజీపీకి ఫిర్యాదు చేసి 20 రోజులైనా ఇప్పటివరకు కేసు నమోదు చేయలేదు. కానీ తెలుగుదేశం నాయకులు ఫిర్యాదు చేశారని 2018లో చేసిన పోస్టులపైనా పలుచోట్ల కేసులు నమోదు చేస్తుండడంపై ప్రజలు విస్తుపోతున్నారు.



బ్రాహ్మణ మహాసభ అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్

బ్రాహ్మణ మహాసభ ఆందోళన

శేషు బ్రాహ్మణ వర్గానికి చెందిన వ్యక్తి కావడంతో రిమాండ్‌కు పంపుతున్నారని, ఆయనతోపాటు నిందితులుగా ఉన్న కమ్మ సామాజికవర్గానికి చెందిన వ్యక్తులను ఎందుకు అరెస్టు చేయలేదని బుధవారం బ్రాహ్మణ మహాసభ ప్రశ్నించింది. గత బుధవారం మహాసభ అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్ ఆధ్వర్యంలో నేతలు అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌కు వచ్చి నిరసన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వానికి పోలీసులు కొమ్ము కాస్తున్నారని ధ్వజమెత్తారు.


న్యూస్‌రీల్

మల్లేశ్వరుని సేవలో హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి



పెదకాకాని: శ్రీభ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానాన్ని రాష్ట్ర హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.శివశంకరరావు శుక్రవారం సందర్శించారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసిన అనంతరం ఆయన స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు, వేదపండితులు వేద ఆశీర్వచనం అందించి స్వామి శేషవస్త్రంతో సత్కరించారు. ఆలయ డెప్యూటీ కమిషనర్ కేబీ శ్రీనివాసరావు స్వామివారి ప్రసాదాలు అందజేశారు.

40,639 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 36,928 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 40,639 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ.15,600 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 17,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ.9,000 నుంచి రూ. 15,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ.8,000 నుంచి రూ.17,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.11,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 23,602 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వి.ఆంజనేయులు తెలిపారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కమిటీలో ఇద్దరికి చోటు

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): వైఎస్సార్ సీపీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గుంటూరు జిల్లాకు చెందిన పలువురిని పార్టీ రాష్ట్ర కమిటీలో నియమిస్తూ శుక్రవారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. గుంటూరు జిల్లాకు చెందిన మస్తాన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా, మెట్టు వెంకటప్పారెడ్డి పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమితులయ్యారు. వీరు పార్టీ అనుబంధ విభాగ కమిటీల ఏర్పాటు, అనుబంధ విభాగ కార్యక్రమాల సమన్వయ బాధ్యతలు నిర్వర్తిస్తారు.

ఆంజనేయుడికి లక్ష తమలపాకుల పూజ



అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామికి పౌర్ణమి సందర్భంగా శుక్రవారం లక్ష తమలపాకుల పూజ నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ అనంతరం ఉభయదాతలు, దేవస్థాన సిబ్బంది, అర్చకులు దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు దేవస్థానం చుట్టూ ప్రదక్షిణలు చేపట్టారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 3,800 క్యూసెక్కులు విడుదల చేశారు. హైలెవల్ కాలువకు 172 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్‌కు 738 క్యూసెక్కులు, తూర్పు కెనాల్‌కు 140 క్యూసెక్కులు, పశ్చిమ కెనాల్‌కు 90 క్యూసెక్కులు, నిజాంపట్నం కాలువకు 187 క్యూసెక్కులు, కొమ్మమూరు కాలువకు 2180 క్యూసెక్కులు విడుదల చేశారు.



శివ లింగాకారంలో కార్తిక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కార్తిక దీపం ప్రకాశివంతం

- పౌర్ణమి పూజలు
- శివనామస్మరణతో మార్మోగిన పెదకాకాని
- భక్తులతో కిటకిటలాడిన ఆలయం
- భక్తిశ్రద్ధలతో కోటి దీపోత్సవం, జ్వాలా తోరణం



కోటి దీపోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర దంపతులు

పెదకాకాని: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న పెదకాకాని శ్రీ మల్లేశ్వరస్వామి దేవస్థానం శుక్రవారం కార్తిక పౌర్ణమి సందర్భంగా కిటకిటలాడింది. తెల్లవారుజామునే సుప్రభాతసేవతో పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. భక్తులు యజ్ఞాల బావి వద్ద పుణ్యస్నానాలు చేసి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఓం నమః శివాయ నామంతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అనంతరం భక్తులు కార్తిక దీపాలు వెలిగించి స్వామిని ఆరాధించారు. పొంగళ్ళు పొంగించి స్వామికి నైవేద్యం సమర్పించారు. మొక్కులు చెల్లించుకున్నారు. స్వామిని దర్శించుకున్నారు. ఆలయ డెప్యూటీ కమిషనర్ కేబీ శ్రీనివాస్ పర్యవేక్షణలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్త వల్లభుడిని సులభంగా దర్శించుకునేలా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. భక్తులకు దాతల సహకారంతో పాలు, మజ్జిగ, తాగునీరు అందించారు. అంతరాలయ దర్శనాలు, అభిషేకాలు, ఏకవారాభిషేక పూజలు, అన్న ప్రాశనలు, నామకరణలు, రాహుకేతు పూజలు అధిక సంఖ్యలో జరిగాయి. ఒక్కరోజులో స్వామికి వివిధ సేవా కార్యక్రమాల ద్వారా రూ.7,50,000ల ఆదాయం లభించినట్లు డెప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం జరిగిన కోటి దీపోత్సవం జ్వాలా తోరణ పూజల్లో ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ దంపతులు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులకు ఆలయ అర్చకులు, వేదపండితులు వేద ఆశీర్వచనం చేశారు. ఆలయ డెప్యూటీ కమిషనర్ కేబీ శ్రీనివాస్ స్వామి శేషవస్త్రం అందించి సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.

ఆనందం.. ఆహ్లాదం

గలగల పారే సెలయేరులాంటి పసిపిల్లల నవ్వులు.. కోయిలమ్మల్లా మధుర కంఠాలతో ఆకట్టుకున్న బాలల గానామృతాలు.. పచ్చని ప్రకృతి ఒడిలో కొండల మధ్యన చెంగు చెంగున గంతులేసే లేడిపిల్లల్లా చిన్నారుల ఉరుకులు.. పురివిప్పి ఆడే నెమలి పిల్లల్లా అలరించిన నవ నాట్యమయూరాలతో వీవీఐటీ బాలోత్సవ్-2024 శుక్రవారం కోలాహలంగా ప్రారంభమైంది. చిట్టి చేతులు గీసిన అందమైన చిత్రలేఖనాలు అబ్బురపరిచాయి. తేటతెలుగు తియ్యని పద్యగానాలు వీనులవిందు చేశాయి. ఏకపాత్రాభినయాలు, శాస్త్రీయ జానపద నృత్యాలు, రంగురంగుల విచిత్ర వేషధారణలు ఆహూతులను కట్టిపడేశాయి.



పోటీల్లో పాల్గొనేందుకు హాజరైన విద్యార్థులు, వారితో వచ్చిన తల్లిదండ్రులు



విద్యార్థిని నాట్య ప్రదర్శన

- ఉత్సాహంగా ప్రపంచ తెలుగు బాలల పండుగ
- వీవీఐటీ బాలోత్సవ్-2024 అట్టహాసంగా ప్రారంభం
- తొలిరోజు పాల్గొన్న 13వేల మందికిపైగా విద్యార్థులు



చిత్రలేఖనం పోటీలో బొమ్మలు గీస్తున్న చిన్నారులు

పెదకాకాని: తెలుగు జాతి గొప్పతనాన్ని, గౌరవాన్ని ప్రపంచ నలుమూలలా చాటి చెప్పడానికి బాలోత్సవ్ దోహదపడుతుందని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ చెప్పారు. ప్రపంచ తెలుగు బాలల పండుగ వీవీఐటీ బాలోత్సవ్-2024 వేడుకలను వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రాంగణంలో శుక్రవారం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ గంట మోగించి ప్రారంభించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ చిన్నారుల్లో సృజనాత్మకతను, నైపుణ్యాలను వెలికితీసే అద్భుత ప్రయత్నం బాలోత్సవ్ అని కొనియాడారు. ఈ బాలోత్సవ్‌లో పాల్గొన్న విద్యార్థులు తమ ప్రతిభతో అంతర్జాతీయ యవనికపై తెలుగు కీర్తిపతాకను ఎగరేయాలని ఆకాంక్షించారు. తెలుగు జాతి సంస్కృతీ, సంప్రదాయాలను కాపాడాలని సూచించారు. మాతృభాష గౌరవాన్ని నిలపాలని పేర్కొన్నారు. వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ చిన్నారులు ఆనందంగా ఉంటే అందరూ సంతోషంగా ఉంటారన్నారు. మూడు రోజుల పాటు ఉత్సాహంగా సాగే పోటీల్లో ప్రతిభ చాటాలని చెప్పారు.

తొలిరోజు వివిధ అంశాల్లో పోటీలు

తొలిరోజు శుక్రవారం 13 వేల మందికిపైగా చిన్నారులు వివిధ అంశాల్లో పోటీపడ్డారు. 20 అంశాలు, 61 విభాగాల్లో మూడు రోజులపాటు 30 వేదికలపై పండుగ వాతావరణంలో పోటీలు జరగనున్నాయి. అనంతరం సాయంత్రం జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పాల్గొన్నారు. ప్రారంభ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, బాలోత్సవ్ కన్వీనర్ డాక్టర్ కండె గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు కృషి



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ కోసమే ప్రభుత్వం హెల్త్ స్క్రీనింగ్ ప్రోగ్రాం చేపట్టినట్లు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం పాత బస్టాండ్ సెంటర్‌లోని జిల్లా పరీక్షా భవన్‌లో కలెక్టర్ చేతుల మీదుగా చైల్డ్ హెల్త్ స్క్రీనింగ్ ప్రోగ్రాం ప్రారంభించారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ వచ్చే ఏడాది ఏప్రిల్ 15 వరకు అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లల్లో ఎదుగుదల లోపాలు గుర్తించేందుకు స్క్రీనింగ్ కార్యక్రమాన్ని ఆశా, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలతో నిర్వహిస్తామని, సమస్యాత్మక కేసులను సమీపంలోని ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి వద్దకు పంపి, వైద్యాధికారి పరిశీలన అనంతరం అవసరాన్ని బట్టి సత్వర చికిత్సా కేంద్రాలకు పంపుతారని చెప్పారు. నిష్ణాతులైన వైద్యులు పరీక్షించి చికిత్స అందజేస్తారని వివరించారు. జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి సమాంతరంగా ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలతో ఇంటింటి సర్వేను నిర్వహించి 18 ఏళ్లు పైబడిన వారందరికీ క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహిస్తామని, సమస్యాత్మక కేసులను వైద్యాధికారి దగ్గరికి పంపుతామని తెలిపారు. వైద్యులు పరీక్షల అనంతరం క్యాన్సర్‌గా అనుమానించిన కేసులను జీజీహెచ్‌లోని క్యాన్సర్ వార్డుకు పంపి, అక్కడ పరీక్షల ద్వారా నిర్ధారణ అయిన కేసులకు చికిత్స అందిస్తామని వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఎ.శ్రావణ్ బాబు, డాక్టర్ సీహెచ్ రత్న మన్మోహన్, డాక్టర్ జయ రామకృష్ణ, జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక, ఉమాదేవి, ఎ.జయప్రద్, ఎస్.వెంకటేశ్వర్లు, శిరీష తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో రూ.10 కోట్లతో భవన నిర్మాణం



నిర్మాణ పనులకు పూజ చేస్తున్న డాక్టర్ పాదిల ప్రసాద్ చిత్రంలో డాక్టర్ యశస్వి రమణ

గుంటూరు మెడికల్ : గుంటూరు జీజీహెచ్‌లో రూ.10 కోట్లతో రెండంతస్తుల భవన నిర్మాణం చేపట్టేందుకు గుంటూరు వైద్య కళాశాల పూర్వ విద్యార్థి డాక్టర్ పాదిల ప్రసాద్ ముందుకు వచ్చారు. గతంలో రూ. 5 కోట్లతో డాక్టర్ పాదిల ప్రసాద్ సూపర్‌స్పెషాలిటీ మిలీనియం బ్లాక్ నిర్మాణం చేపట్టిన ప్రసాద్ మరోసారి పెద్ద మనస్సుతో రూ.10 కోట్లతో రెండంతస్తుల భవన నిర్మాణానికి రంగం సిద్ధం చేశారు. ఈమేరకు శుక్రవారం గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణను కలిసి నిర్మాణ పనులకు పూజ చేశారు. డాక్టర్ పాదిల

డాక్టర్ పాదిల ప్రసాద్

ప్రసాద్ మాట్లాడుతూ జీజీహెచ్‌కు వచ్చే పేద రోగులకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా తాము భవన నిర్మాణం చేపడుతున్నామన్నారు. గతంలో తాము నిర్మించిన పాదిల ప్రసాద్ సూపర్ స్పెషాలిటీ భవనం పైనే అదనంగా మరో రెండంతస్తులు నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించే వైద్య విభాగాలన్నీ ఒకేచోట అందుబాటులో ఉంచాలనే లక్ష్యంతో భవన నిర్మాణం చేపడుతున్నామన్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ మాట్లాడుతూ పెద్ద మనస్సుతో ఆసుపత్రిలో రూ.10 కోట్లతో భవన నిర్మాణం చేపట్టేందుకు ముందుకు వచ్చిన డాక్టర్ పాదిల ప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ పాదిల ప్రసాద్‌ను ఆదర్శంగా తీసుకుని మరికొంత మంది దాతలు ఆసుపత్రి అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందించాలన్నారు. కార్యక్రమంలో జింకానా కో ఆర్డినేటర్లు డాక్టర్ వెనిగండ్ల బాలభాస్కరరావు, డాక్టర్ హనుమంతరావు, అడ్మినిస్ట్రేటర్ బి.ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 2,000 గరిష్ఠం : రూ. 3,000

మోడల్ ధర రూ. 2,500

క్లుప్తంగా

ఆరు మండలాల్లో స్వల్ప వర్షపాతం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు ఆరు మండలాల్లో జల్లులతో కూడిన స్వల్ప వర్షపాతం నమోదైంది. తుళ్ళూరు మండలంలో 7.8 మిల్లీ మీటర్లు, ఫిరంగిపురం 4.8, మేడికొండూరు 2.5, కొల్లిపర 2.4, పొన్నూరు 1.2, చేబ్రోలు మండలంలో 1 మి.మీ చొప్పున వర్షం పడింది.

రూ.82 లక్షల విలువైన ఎరువుల అమ్మకాలు నిలిపివేత



ప్రత్తిపాడు: ఎమ్మార్పీ కన్నా అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్న ఓ ఫెర్టిలైజర్ దుకాణంపై వ్యవసాయశాఖ అధికారులు కన్నెర్రజేశారు. రూ.82 లక్షల విలువ చేసే ఎరువుల అమ్మకాలను నిలిపివేశారు. ప్రత్తిపాడులోని మోహన్ ట్రేడర్స్‌లో ఎమ్మార్పీ కన్నా అధికంగా ఎరువులను విక్రయిస్తున్నారన్న సమాచారం వ్యవసాయశాఖ అధికారులకు అందింది. దీంతో ప్రత్తిపాడు ఏవో కె.అరుణకుమారి సిబ్బందితో కలిసి దుకాణంలో శుక్రవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీలు చేశారు. రికార్డులు సక్రమంగా నిర్వహించకపోవడంతో పాటు ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు సక్రమమైన బిల్లులు ఇవ్వకుండా తెల్లకాగితాలపై దుకాణం స్టాంప్ వేసి ఇస్తున్నట్లు ఏవో గుర్తించారు. ఇదేమని దుకాణ నిర్వాహకుడు ఎస్.శ్రీనివాసరావును ప్రశ్నించారు. అతను చెప్పిన సమాధానంతో సంతృప్తి చెందని ఏవో రూ.82,94,548 విలువ చేసే ఎరువుల అమ్మకాలను నిలిపివేశారు. షాప్ లైసెన్స్ సస్పెండ్ చేయాలని కోరుతూ గుంటూరు ఏడీఏకు సిఫారసు చేసినట్లు అరుణకుమారి తెలిపారు. ఇప్పటికే దుకాణ నిర్వాహకుడికి పలు మార్లు ఎమ్మార్పీ కన్నా అధిక ధరలకు ఎరువులు విక్రయించవద్దని, బిల్లులు సక్రమంగా ఇవ్వాలని సూచించినా పట్టించుకోలేదని, అందుకే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎరువుల విక్రయాలను నిలిపివేశామని ఏవో చెప్పారు.

తెలుగు సినిమాకు 'సాహసవంతుడు'

సూపర్‌స్టార్ కృష్ణ జీవిత సాఫల్య పురస్కార మహోత్సవంలో వక్తలు



రూపశిల్పి మాధవరావుకు కృష్ణ జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం చేస్తున్న దృశ్యం

తెనాలి: తెలుగు సినీపరిశ్రమలో తనదైన ప్రయోగాలతో తెలుగు సినిమాను ఉన్నతస్థాయికి తీసుకెళ్లిన సాహసవంతుడు సూపర్‌స్టార్ కృష్ణ అని ప్రముఖ సినీ మాటల రచయిత డాక్టర్ సాయిమాధవ్ బుర్రా అన్నారు. కళల కాణాచి-తెనాలి, వేద గంగోత్రి ఫౌండేషన్-విజయవాడ, సూపర్‌స్టార్ కృష్ణ కల్చరల్ వింగ్-తెనాలి సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం సూపర్‌స్టార్ కృష్ణ జీవిత కాల సాఫల్య పురస్కార మహోత్సవాన్ని నిర్వహించారు. స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాకేంద్రంలో ఏర్పాటైన సభకు కల్చరల్ వింగ్ అధ్యక్షుడు ఈదర వెంకట పూర్ణచంద్ అధ్యక్షత వహించారు. హీరో కృష్ణకు చివరివరకు రూపశిల్పిగా వ్యవహరించిన చేబ్రోలు మాధవరావుకు సూపర్‌స్టార్ కృష్ణ జీవితసాఫల్య పురస్కారాన్ని సినీ నిర్మాత నన్నపనేని సుధాకర్ చేతులమీదుగా ప్రదానం చేశారు. సభలో డాక్టర్ సాయిమాధవ్ మాట్లాడుతూ కృష్ణ నటించిన సత్యనారాయణ స్వామి సినిమా, తనకు ఇండస్ట్రీని పరిచయం చేసిందనీ, కృష్ణం వందే జగద్గురుమ్ సినిమా తనను ఇండస్ట్రీకి పరిచయం చేసినట్టు చెప్పుకున్నారు. సూపర్‌స్టార్ అయినప్పటికీ కృష్ణ, విమర్శలను సహృదయంతో స్వీకరించేవారని, ఆయనకు తెనాలిలో పౌరసన్మానం చేయాలని భావించినా సాధ్యపడలేదన్నారు. సినీనిర్మాత నన్నపనేని సుధాకర్ మాట్లాడుతూ కృష్ణతో ఇంద్రధనుస్సు సినిమా చేశాననీ, అప్పట్లో సినిమాకు రూ.18 లక్షలు ఖర్చయిందని చెప్పారు. సినిమా చిత్రీకరణకు కృష్ణ ఎంతగానో సహకరించారని గుర్తుచేసుకున్నారు. పురస్కారగ్రహీత మాధవరావు మాట్లాడుతూ తొలిసారిగా కొడాలి గోపాలరావు చైర్మన్ నాటకంలో నటించిన కృష్ణకు మేకప్ వేశాననీ, తర్వాత తొలి సినిమా నుండి చివరి సినిమా వరకు ఆయన రూపశిల్పిగా పని చేయడం తన అదృష్టమన్నారు. వేదగంగోత్రి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వరప్రసాద్, మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి, సినీదర్శకుడు రాజా వన్నెంరెడ్డి, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, చెరుకుమల్లి సింగారావు మాట్లాడారు. సభానంతరం 'నటశేఖరుని సినీ పాటల గానామృతం' మ్యూజికల్ నైట్ నిర్వహించారు.

రహదారుల మరమ్మతులు త్వరగా పూర్తిచేయండి

కలెక్టర్ నాగలక్ష్మి



జన జాతీయ గౌరవ దినోత్సవ సభలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: జిల్లాలో రహదారుల అత్యవసర మరమ్మతులను వేగంగా పూర్తిచేయాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులు, కాంట్రాక్టర్లతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఆర్ అండ్ బీ గుంటూరు, తెనాలి, తాడికొండ సబ్ డివిజన్ పరిధిలోని ప్రధాన రహదారుల్లో 250 కిలో మీటర్ల మేర అత్యవసర మరమ్మతుల కోసం రూ.13.36 కోట్ల అంచనాతో 49 పనులను మంజూరు చేశామన్నారు. వీటిలో ఇప్పటికే 16 పనులను ప్రారంభించామన్నారు. టెండర్ దశలో ఉన్నవాటిని త్వరగా పిలవాలని తెలిపారు. ఈనెల 30 నాటికి 40 శాతం పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఆర్ అండ్ బీ ఎస్ఈ శ్రీనివాసమూర్తి, ఈఈ విశ్వనాథరెడ్డి, డీఈ చిన్నయ్య పాల్గొన్నారు.

లక్ష్యాలు పూర్తిచేయాలి

జిల్లాలో 200 రోజుల యాక్షన్ ప్లాన్‌కు సంబంధించి వివిధ శాఖలకు నిర్దేశించిన లక్ష్యాలను వచ్చే నెల చివరినాటికి అధికారులు పూర్తి చేయాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో ఆమె అధికారులతో సమీక్షించారు. పలు శాఖల పనులపై ఆరా తీశారు. సమావేశంలో సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూదనరావు, సీపీఓ శేషశ్రీ, బీసీ కార్పొరేషన్ ఈడీ దుర్గాబాయి, జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

గిరిజనుల గౌరవాన్ని కాపాడతాం

గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ వారి ఆత్మ గౌరవాన్ని ప్రభుత్వం కాపాడుతుందని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన జన జాతీయ గౌరవ దినోత్సవ సభలో కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు, గిరిజన నేత బీర్స ముండా స్ఫూర్తిని దేశ వ్యాప్తంగా తెలియచేసే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఆయన జన్మదినం రోజున జన జాతీయ గౌరవ దినోత్సవం నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. ఆయన దేశంలో గిరిజనుల హక్కుల కోసం ఉద్యమాలు చేశారని, మన్యంలో పోడు భూములపై రాజీలేని పోరాటం చేశారని కొనియాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నాయని వివరించారు. అనంతరం కలెక్టర్, డీఆర్వో ఖాజావలి, గిరిజన సంక్షేమాధికారి మురళీధర్, గిరిజన నాయకులు శ్రీను నాయక్, ముడావత్ శివనాయక్, సంజయ్ బాబు, కొండపల్లి శ్రీనివాస్ సేవాలాల్, ఏకలవ్యుడు, చెంచులక్ష్మి, అల్లూరి సీతారామరాజు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బీర్సా ముండా చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

మార్టూరు: జాతీయ రహదారి దాటే ప్రయత్నం చేస్తున్న వృద్ధుడిని లారీ ఢీకొట్టడంతో మృతి చెందాడు. ఈ ఘటన మార్టూరులో శుక్రవారం జరిగింది. ఏఎస్ఐ మహబూబ్ బాషా వివరాల మేరకు.. స్థానిక కిశోర్ కాలనీకి చెందిన దార్ల పెద్ద వెంకటేశ్వర్లు (73) అంబేడ్కర్ కాలనీ సర్వీసు రోడ్డు పక్కన గల ఐరన్ గ్రిల్ మధ్య నుంచి జాతీయ రహదారి దాటేందుకు ఒంగోలు- గుంటూరు రహదారిపైకి వచ్చాడు. ఈ క్రమంలో అదే మార్గంలో ఒంగోలు వైపు నుంచి విజయవాడకు టమాటా లోడుతో వెళ్తున్న లారీ వెంకటేశ్వర్లును ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు అపస్మారక స్థితికి చేరుకున్న అతడ్ని స్థానికులు మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడు పెద్ద వెంకటేశ్వర్లుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

పోక్సో కేసులో నిందితుడి అరెస్ట్

నరసరావుపేట టౌన్: మైనర్‌పై లైంగిక దాడి కేసు లో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ కె. నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. రామిరెడ్డిపేటకు చెందిన 16 ఏళ్ల బాలికను ప్రేమ పేరుతో వంచించి సాయి నగర్‌కు చెందిన సాయిబ ఉరఫ్ సోను లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ సమయంలో తీసిన ఫొటోలను చూపి తన కోరిక తీర్చకుంటే సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తానని బెదిరింపులకు దిగా డు. ఈ మేరకు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో నాలుగు రోజుల క్రితం వన్‌టౌన్ పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు.

నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

రాజుపాలెం: సబ్జెక్టులు తప్పటం, ప్రేమ వ్యవహారాన్ని తల్లితండ్రులు నిరాకరించటంతో మనస్తాపానికి గురై నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేసింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమె నుంచి శుక్రవారం రాజుపాలెం ఎస్ఐ వేణుగోపాల్ సేకరించిన వివరాల ప్రకారం... బీఎస్సీ నర్సింగ్ మొదటి ఏడాది చదువుతున్న ఆమె శుక్రవారం కాలేజీలో టెర్రస్ మీద నుంచి దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. వైద్యులు మెరుగైన వైద్యం అందించటంతో కోలుకుంటోంది. మానసిక సమస్యలతో ఆరు నెలల నుంచి మందులు వాడుతోంది. ఫస్ట్ సెమిస్టర్‌లో నాలుగు సబ్జెక్టులు ఫెయిల్ కావడంతో ఇబ్బంది పడుతోంది. ప్రేమ వ్యవహారాన్ని తల్లిదండ్రులు ఒప్పుకోకపోవడంతో మనస్తాపానికి గురైంది. ఈ నేపథ్యంలో ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ఎస్ఐ తెలిపారు.

పేదలను ఆదుకోవాలి



సత్రశాల (రెంటచింతల): శివకేశవులకు అత్యంత ప్రీతికరమైన కార్తిక మాసంలో శివుడిని ఆరాధిస్తూనే పేదలను ఆదుకుంటే దైవానుగ్రహం లభిస్తుందని చిత్తూరు జిల్లా డిప్యూటీ కలెక్టర్ హరికృష్ణ అన్నారు. కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని శైవక్షేత్రమైన సత్రశాల శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానానికి శుక్రవారం ఆయన సతీసమేతంగా వచ్చారు. స్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దానధర్మాలు గోప్యంగా చేస్తే ఎక్కువ ఫలితాలు ఉంటాయన్నారు. అన్నదాన కమిటీ సభ్యులను అభినందించారు. దంపతులను సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు గొట్టం శ్రీనివాసరెడ్డి, మున్నా ప్రభురాజు నీలం మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల కొరత నివారణకు చర్యలు

మాచర్ల రూరల్: అర్బన్ హెల్త్ సెంటర్‌లో వైద్యుల కొరత తీర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని డీఎంహెచ్‌వో డాక్టర్ రవి తెలిపారు. పల్నాడు ప్రాంతంలోని వినుకొండ, మాచర్ల, గురజాల ప్రాంతాలలోని సిబ్బంది కొరత ఉందని పేర్కొన్నారు. వీటి భర్తీకి ప్రభుత్వానికి నివేదిక అందించగా.. 2వ మెడికల్ ఆఫీసర్‌ను ఇచ్చేందుకు అంగీకరించారని శుక్రవారం పేర్కొన్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు పూర్తిగా అదుపులోకి వచ్చాయని వివరించారు. బీపీ, షుగర్, క్యాన్సర్ వంటి వాటిపై సర్వే జరుగుతోందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్, లెప్రసీ జిల్లా అధికారి మురళీ కృష్ణ, పీహెచ్‌సీ వైద్యులు వెస్లి, ఓరుగంటి ప్రవీణ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విశ్రాంత ఉద్యోగి మృతి



హనుమంతరావు మృతదేహాన్ని తరలిస్తున్న అంబులెన్స్ సిబ్బంది, బంధువులు


తెనాలిరూరల్: రోడ్డు ప్రమాదంలో విశ్రాంత ఉద్యోగి మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి తెనాలి-విజయవాడ రహదారిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. స్థానిక చెంచుపేటలోని యాని హోమ్స్ అపార్ట్‌మెంట్‌లో నివసించే యార్లగడ్డ హనుమంతరావు(73) సివిల్ సప్లయిస్‌లో పని చేసి రిటైరయ్యారు. ఇక్కడి అపార్ట్‌మెంట్‌లో ఒంటరిగా నివసిస్తున్నారు. పిల్లలు అమెరికాలో స్థిరపడ్డారు. శుక్రవారం రాత్రి హనుమంతరావు తన బైక్‌పై కొలకలూరు నుంచి తెనాలి వస్తుండగా వీఎస్సార్ కళాశాల సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. కింద పడిన ఆయన తలపైకి లారీ ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందారు. లారీ ఆగకుండా వెళ్లిపోయింది. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. ఎస్ఐ సీహెచ్ ప్రతాప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సోషల్ మీడియా యాక్టివిస్ట్ పంచ్ ప్రభాకర్‌పై కేసు!

పెదకాకాని: సోషల్ మీడియా యాక్టివిస్ట్ పంచ్ ప్రభాకర్‌పై పెదకాకాని పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పెదకాకాని గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు పెండ్యాల సురేష్ ఫిర్యాదు మేరకు అమెరికాలో నివాసం ఉంటున్న పంచ్ ప్రభాకర్ అలియాస్ డాక్టర్ ప్రభాకరరెడ్డిపై ఈనెల 10న రాత్రి పోలీసులు కేసు నమోదు చేసినట్లు విశ్వసనీయ సమాచారం.

ఆటో బోల్తా పడి ఒకరు మృతి

పలువురికి తీవ్రగాయాలు



దండే సుబ్బారావు (ఫైల్)

గురజాల రూరల్: ఆటో బోల్తా పడి ఒకరు మృతి చెందగా.. పలువురికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం... రెంటచింతల గ్రామానికి చెందిన పలువురు శుక్రవారం కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని దైద అమరలింగేశ్వర స్వామిని దర్శించుకునేందుకు రెంటచింతల నుంచి ఆటో కిరాయికి మాట్లాడుకుని వచ్చారు. స్వామి వారిని దర్శించుకున్నాక తిరుగు ప్రయాణంలో కిలోమీటరు దూరం వెళ్లాక ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన దొండే సుబ్బారావు (37) అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలో ప్రయాణిస్తున్న పలువురికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను గురజాల సామాజిక ఆరోగ్య కేంద్రానికి పంపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరోగ్యపురంలో విషాదఛాయలు

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలోని ఆరోగ్యపురంలో శుక్రవారం విషాదఛాయలు అలుముకున్నాయి. కార్తిక పౌర్ణమి సందర్భంగా కాలనీకి చెందిన వ్యవసాయ కూలీలు ఆటోలో అమరలింగేశ్వరస్వామిని దర్శించుకుని తిరిగి రెంటచింతలకు వస్తున్నప్పుడు వాహనం బోల్తా పడింది. కాలనీకి చెందిన దండే సుబ్బారావు(38) అక్కడికక్కడే మృతి చెందగా, పలువురికి స్వల్పగాయాలు అయ్యాయి. సుబ్బారావు మృతి చెందడంతో కుటుంబ సభ్యులతోపాటు కాలనీ వాసులు గురజాల ప్రభుత్వ ఆస్పత్రి వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. సుబ్బారావు కుమారుడు పార్థు చంద్ర గణేష్ 2019 ఫిబ్రవరి 7వ తేదీన ఇంటి నుంచి స్కూల్‌కు వెళ్తున్న సమయంలో కారు ఢీకొని చనిపోయాడు. ఆయన సోదరుడు దండే వెంకటేశ్వర్లు కూడా కొంత కాలం క్రితం తిరుపతి దైవ దర్శనానికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. సుబ్బారావు స్థానిక బస్టాండ్ సెంటర్లో కట్టెల అడితి పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. అతని భార్య లక్ష్మీప్రసన్న వ్యవసాయ కూలీ. ఆ ఇంట్లోని వారు రోడ్డు ప్రమాదాల్లో ఇలా మృత్యువాత పడుతుండటంతో కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. సుబ్బారావుకు భార్య లక్ష్మీ ప్రసన్న, మరో కుమారుడు వెంకట జయంత్ ఉన్నారు.

పుస్తక పఠనంతో వ్యక్తిత్వ వికాసం

జిల్లా ఆడిట్ అధికారి ధనలక్ష్మి



పుస్తక ప్రదర్శన ప్రారంభిస్తున్న జిల్లా ఆడిట్ అధికారి ధనలక్ష్మి

గుంటూరు ఎడ్యుకేషన్: పుస్తక పఠనంతో వ్యక్తిత్వ వికాసం అభివృద్ధి చెందుతుందని జిల్లా ఆడిట్ అధికారి బి.ధనలక్ష్మి పేర్కొన్నారు. అరండల్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శుక్రవారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ధనలక్ష్మి మాట్లాడుతూ ప్రదర్శనలో ఏర్పాటు చేసిన విజ్ఞానదాయక పుస్తకాలు, నవలలు, నిఘంటువులు, సాహిత్యం, జ్యోతిష్యం, పురాణాలతో కూడిన పుస్తకాలను పాఠకులు, విద్యార్థులు చదవాలని సూచించారు. సంజీవని పాలీక్లినిక్ డైరెక్టర్ ఆనెం సంజీవరెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయాలను ఉపయోగించుకుని విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకోవాలని సూచించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయసంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు అవసరమైన అన్ని రకాల పుస్తకాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉప గ్రంథ పాలకురాలు కె.ఝాన్సీలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ ఎం.సీతారామయ్య, గ్రంథ పాలకులు కె.చిన్నపరెడ్డి, ఎస్.నాగిరెడ్డి, ఐవీ దుర్గారెడ్డి, విద్యార్థులు వారి తల్లిదండ్రులు, పాఠకులు పాల్గొన్నారు.

పారదర్శకంగా పత్తి కొనుగోళ్లు

సీసీఐ కొనుగోలు కేంద్రంలో కేంద్రమంత్రి పెమ్మసాని తనిఖీలు



కుర్నూతల సీసీఐ కేంద్రంలో రైతులు, అధికారులతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

ప్రత్తిపాడు: సీసీఐ కేంద్రంలో పత్తి కొనుగోళ్ళు పారదర్శకంగా జరగాలని కేంద్ర గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. వట్టిచెరుకూరు మండలం కుర్నూతలలోని గాయత్రి జిన్నింగ్ మిల్లులో ఉన్న సీసీఐ కేంద్రంలో శుక్రవారం కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులుతో కలిసి ఆకస్మికంగా తనిఖీలు చేశారు. రైతులతో మాట్లాడారు. కొనుగోళ్ల సమయంలో తలెత్తుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మాయిశ్చరైజ్ టెస్టుల్లో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని రైతులు పెమ్మసానికి వివరించారు. అనంతరం రైతుల సమక్షంలో దగ్గరుండి అధికారులతో మాయిశ్చరైజ్ పరీక్షలు చేయించారు. పరీక్షలలో తేమ శాతంలో మార్పు ఉండడాన్ని గమనించిన పెమ్మసాని అధికారులతో మాట్లాడారు. వాతావరణం అనుకూలంగా లేని సమయంలో రైతులను ఇబ్బంది పెట్టకుండా కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు. సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో ఫిర్యాదు బాక్సు, టోల్ ఫ్రీ నంబర్లను అందుబాటులో ఉంచాలని జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజను ఆదేశించారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ పత్తి తేమ పరీక్షలలో తేడాలు రావడం వలన రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. కల్తీ విత్తనాలు, పురుగుమందులు అమ్మేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

20 తర్వాత మెరుపు సమ్మెకు సివిల్ సప్లయిస్ కార్మికులు సిద్ధం

కూలిరేట్లు పెంచాలని డిమాండ్



సమ్మెకు మద్దతు తెలపాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణకు వినతిపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్) : కూలిరేట్లు పెంచాలని సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ముఠా కార్మికులు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుంటే ఈనెల 20 తర్వాత రాష్ట్రవ్యాప్తంగా మెరుపు సమ్మె నిర్వహించేందుకు ఏఐటీయూసీ సివిల్ సప్లయిస్ కార్మిక వర్గం సిద్ధంగా ఉందని ఆంధ్రప్రదేశ్ స్టేట్ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ హమాలీ(ముఠా)వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి రావుల అంజిబాబు తెలిపారు. స్థానిక శారదాకాలనీలో సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావులకు కార్మికుల సమస్యలను అంజిబాబు వివరించారు. సమ్మెకు మద్దతు కోరారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం కూలి రేట్ల అగ్రిమెంట్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలపై పోరాటానికి తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్, నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడ హనుమంతరావు, సివిల్ సప్లయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కోట్ల మరియదాసు, దానం, సురేష్, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల మోకాళ్ల దీక్ష



న్యాయం చేయాలంటూ మోకాళ్లపై నిలబడి దీక్ష చేస్తున్న సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు

తాడేపల్లిరూరల్ : స్థానిక బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు తమకు చట్టపరంగా, న్యాయంగా రావాల్సిన బకాయిలను చెల్లించాలంటూ శుక్రవారం మోకాళ్లపై నిలబడి ప్రదర్శన నిర్వహించారు. సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు మాట్లాడుతూ యాజమాన్యం మొండి వైఖరి విడనాడాలని, కోర్టు తీర్పులనూ ధిక్కరిస్తున్నారని, న్యాయస్థానాలపై గౌరవం ఉంటే కార్మికులకు న్యాయం చేయాలని, సెంట్రల్ ట్రిబ్యునల్ కోర్టు, హైకోర్టు తీర్పులను అమలు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని 370 కుటుంబాలతో ముడిపడి ఉన్న ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, కె.ఆదినారాయణ, సూరి, సాంబయ్య, యెహోషువా, ఆశీర్వాదం, బి.నవనీతం, శారద, నారమ్మ, రమాదేవి, టి.నాగేశ్వరరావు, ఇమాంబి తదితరులు పాల్గొన్నారు.

చిత్రోత్సాహం

రాష్ట్రస్థాయి చిత్రలేఖన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రథమస్థానంలో నిలిచిన విద్యార్థిని సింధుశ్రీని అభినందిస్తున్న ముఖ్యఅతిథులు

గుంటూరు ఎడ్యుకేషన్: సామాజిక స్పృహకు అద్దం పట్టేలా విద్యార్థినులు వేసిన చిత్రాలు అందరినీ మంత్రముగ్ధులను చేశాయి. జేకేసీ కళాశాలలో మహిళా సాధికారత సమితి ఆధ్వర్యంలో భవిష్యత్తు కోసం అమ్మాయిల దృష్టి (గరల్స్ విజన్ ఫర్ ఫ్యూచర్) అనే అంశంపై శుక్రవారం రాష్ట్రస్థాయి చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. విద్యార్థులు తమ ఆలోచనలు, భవిష్యత్తు ఆకాంక్షలను ప్రతిబింబించేలా అద్భుతమైన చిత్రాలకు రూపం ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 35 కళాశాలల నుంచి 90 మంది పోటీ పడ్డారు. విజయవాడలోని మాంటిస్సోరి కాలేజీ విద్యార్థిని ఎం.సింధుశ్రీ ప్రథమ బహుమతిగా రూ.ఐదువేలు గెలుపొందింది. అలాగే ఏఎన్‌యూ సైన్స్ కళాశాల విద్యార్థిని ఎం.గౌతమి ద్వితీయ బహుమతిగా రూ.మూడు వేల నగదు గెలిచింది. లాంలోని చలపతి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి వి.హేమంత్ తృతీయ బహుమతిగా రూ.రెండు వేలు, సత్తెనపల్లిలోని నలంద ఫార్మసీ కళాశాల విద్యార్థిని టి.వైష్ణవి ప్రత్యేక బహుమతిగా రూ.వెయ్యి, జేకేసీ కళాశాల విద్యార్థి డి.కళ్యాణ్ ప్రోత్సాహక బహుమతిగా రూ.500 నగదు అదుకున్నారు. ఈసందర్భంగా ఉత్తమ చిత్రాలను గీసిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ జాగర్లమూడి మురళీమోహన్, ప్రిన్సిపాల్ పి.గోపీచంద్, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్ఆర్కే ప్రసాద్, మహిళా సాధికారత సమితి ఉపాధ్యక్షురాలు పి.నాగసుశీల, అధ్యాపకులు అభినందించారు.



ప్రథమస్థానం పొందిన చిత్రం



ద్వితీయ స్థానం పొందిన బొమ్మ